క్లుప్తంగా

విద్యార్థి నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ఇబ్రహీంపట్నం: ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు, బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నేత మంద సురేష్‌ను తుర్కగూడలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి... ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. సురేష్ తండ్రి నర్సింహా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, నర్సింహ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాయల మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఉన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

ఆమనగల్లు: ముసాయిదా జాబితా అభ్యంతరాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈ నెల 19న మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు బుధవారం ఎంపీడీఓ కుసుమ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు హాజరు కావాలన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఓటర్ లిస్టు డ్రాఫ్టుపై ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, నాయకులతో సమీక్ష నిర్వహించనున్నామని ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. సమావేశానికి ఆయా పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని చెప్పారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల ఓటరు ముసాయిదా జాబితా అభ్యంతరాలపై అఖిల పక్ష సమావేశాన్ని ఉదయం 11 గంటలకు పట్నం ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే.. నేటి సమీక్షలో అధికారుల దృష్టికి తేవాలని ఆమె సూచించారు. సమీక్షలకు అన్ని పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన



జీపీ కార్యదర్శి, సిబ్బందితో మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీలో 2018–23 సంవత్సరాల మధ్య కాలంలో ఏర్పాటైన లే అవుట్‌లకు సంబంధించిన రికార్డులను డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఏడీ సత్యభామ బుధవారం పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జీపీ పరిధి లే అవుట్, బిల్డింగ్‌ల అనుమతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి రాఘవేందర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో పలు లే అవుట్లు, నివాస గృహాలను సందర్శించారు. భవనాలు, వాటి ఎత్తు, ప్రాథమిక సౌకర్యాల ఏర్పాటును పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ సిబ్బంది ఉన్నారు.

టాస్క్ సీఓఓకు సన్మానం



రాఘవేందర్‌రెడ్డిని సన్మానించిన యువజన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) చీఫ్ ఆపరేటింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ నాయకులు పలువురు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాపోతు అనిల్‌గౌడ్, నాయకులు అభినవ్‌రెడ్డి, ఇమ్రాన్ బాబా, రమేశ్‌నాయక్, మల్లేశ్, మహేశ్, లింగం, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల పరిధి చుక్కాపూర్‌లో ఆయన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో, హైదరాబాద్ కామినేని హాస్పిటల్, ఆమన్‌గల్లు లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 261 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, లలిత, జ్యోతయ్య, గౌడ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: శ్రీరంగనగర్ కాలనీలో..



యాచారం: నల్లవెల్లిలో ఓం యూత్ ఆధ్వర్యంలో..

గంగమ్మ ఒడికి గణనాథులు



కడ్తాల్: పూజా కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

- 12వ రోజు కొనసాగిన నిమజ్జన వేడుకలు
- లడ్డూ వేలంలో భక్తుల పోటాపోటీ
- శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం
- శుక్రవారంతో నిమజ్జనోత్సవాలు ముగుస్తాయన్న అధికారులు

ఇబ్రహీంపట్నం: చవితి ఉత్సవాల్లో భాగంగా 12 రోజైన బుధవారం గణనాథులకు భక్తులు భక్తిశ్రద్ధలో పూజలు చేశారు. ఈ సందర్భంగా లంబోదరుడి చేతిలోని లడ్డూలను వేలం వేయగా.. భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ.. శోభాయాత్రగా వెళ్లి.. పార్వతీపుత్రుడను గంగమ్మ ఒడికి చేర్చారు. ఇదిలా ఉండగా.. నిమజ్జనోత్సవాలు శుక్రవారం వరకు కొనసాగనున్నాయని సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్నం ఠాణా పరిధిలో 289 వినాయక మండపాలను ఏర్పాటు చేశారని, మంగళ, బుధవారాల్లో అత్యధికంగా నిమజ్జనానికి తరలినట్లు సీఐ పేర్కొన్నారు.

రూ.68 వేలు..

తుర్కగూడలో నవ భారత్ యూత్ ఆధ్వర్యంలో కొలువైన వినాయకుడి చేతిలోని లడ్డూను వేలంలో రూ.68 వేలకు మార్కెట్ మాజీ డైరెక్టర్ ఏనుగు బుచ్చిరెడ్డి దక్కించుకున్నారు. అనంతరం గణనాథున్ని నిమజ్జనానికి తరలించారు.

రూ.2.10 లక్షలు..

కడ్తాల్: మండల పరిధి పలు గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. గానుగుమార్లతండా నవతరం యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి భక్తి శ్రద్ధలతో భక్తజనం ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా లంబోదరుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. రూ.2.10 లక్షలకు రాకేశ్‌నాయక్ సొంతం చేసుకున్నారు. చిన్న లడ్డూను రూ.1.52 లక్షలకు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్ కైవసం చేసుకున్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, మోతా, రాజునాయక్, మునేశ్, రాజునాయక్, రాఘవేందర్ ఉన్నారు.

నాయకుల సందర్శన

పలు వినాయక మండపాలను డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీక్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్ తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం: వేలంలో దక్కించుకున్న ప్రసాదంతో భక్తుడు బుచ్చిరెడ్డి



యాచారం: చింతపట్లల్లో రూ.55 వేలకు లడ్డూను దక్కించుకున్న భక్తులు

గణపతి హోమం

ఆమనగల్లు: పట్టణంలోని పాత శివాలయంలో కొలువుదీరిన గణనాథునికి శివాలయ యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం గణపతి హోమం చేశారు. భక్తులు కండె సీతమ్మ, లింగయ్యల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ పూజారి చెర్కు శివకుమార్, అక్షయ్‌కుమార్, కాలనీవాసులు, రాఘవేందర్, తిరుపతయ్య, రాకేశ్, కోట్ల వెంకటేశ్, శ్రీనివాస్, యాదమ్మ, భాగ్యమ్మ, సృజన, తేజ, సురేశ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న భక్తులు



కడ్తాల్: గానుగుమార్లతండాలో లడ్డూలను దక్కించుకున్న భక్తులతో యూత్ నాయకులు



యాచారం: నల్లవెల్లిలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు

సదస్సును జయప్రదం చేయండి

మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మా



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మత్స్యకార్మిక సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ్మ కోరారు. బుధవారం సంఘం నేతలతో కలిసి సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు కాలుష్యం కావడంతో పాటు.. కబ్జాకు గురవుతున్నాయని ఆందోళన చెందారు. వాటిని సంరక్షించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వృత్తి రక్షణ, కార్మికుల ఉపాధి తదితర అంశాలను సదస్సులో చర్చించనుననట్లు తెలిపారు. ఈ నెల 25న పట్నంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న సదస్సుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, వాకిటి శ్రీహరి, ముఠా గోపాల్, మత్స్యశాఖ రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, సంఘం నేత జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర నేతలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముదిరాజ్లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చనమోని శంకర్, మత్స్య సొసైటీ స్థానిక కార్యదర్శి గుంటి బీమ్‌రావు, మహిళా సొసైటీ అధ్యక్షురాలు మంగమ్మ, సోషల్ మీడియా కన్వీనర్ రాఘవేందర్, భిక్షపతి, భాస్కర్, రవికుమార్, పవన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

సీఐ శివప్రసాద్



కడ్తాల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని సీఐ శివ ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. డబ్బు, సమయం ఆదా అయ్యేలా రాజీమార్గంలో పెండింగ్ కేసుల పరిష్కారానికి ఇది మంచి అవకాశమని చెప్పారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు, స్నేహభావంతో మెలగడానికి అదాలత్ దోహదపడుతుందని పేర్కొన్నారు. తగాదాలు, యాక్సిడెంట్లు, భూ పంచాయితీలు, కొట్లాటలు, వాటి కేసులు, మోసాలు, దొంగతనాలు తదితర కేసుల పరిష్కారానికి ఇరువురూ.. పెద్దల సమక్షంలో మాట్లాడుకుని, రాజీ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 28వ తేది వరకు ఆమనగల్లు కోర్టుహాలు ప్రాంగణంలో నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీపడవచ్చని స్పష్టంచేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ హయత్‌నగర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్(పోషణ మాసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఫలితంగా ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోషకాహారం లోపం పిల్లల్లో ఉండకూడదనే ఉద్దేశంతో యూఎస్ఓ ఆధ్వర్యంలో నడుస్తున్న యూనిసెఫ్ ప్రపంచ దేశాలకు పోషకాహారంతో కూడిన ఫుడ్‌ను అందిస్తోందన్నారు. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా పోషకాహారంతో పాటు గుడ్లు, ఇతర ఆహార పదార్థాలను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, సీడీపీఓ రేణుక, ఎన్ఆర్‌హెచ్ఎం జిల్లా కో–ఆర్డినేటర్ ఆశ్రిత, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తా

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, మౌలిక వసతులను కల్పించి, సమస్యలు పరిష్కరిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల పరిధి చుక్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌ను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మూత్రశాల నీటి సంపునకు పైకప్పు (స్లాబ్) వేయించాలని ప్రధానోపాధ్యాయుడు రామనాథం.. ఉప్పలను కోరగా.. ఆయన మాట్లాడుతూ, తన ట్రస్ట్ నిధులతో సమస్యలను పరిష్కరిస్తాన్నారు. మల్లారెడ్డి, శ్రీను, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలి

ఇబ్రహీంపట్నం రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ మల్లేశ్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పిల్లల ఫీజు బకాయిలు చెల్లించాలని ఈ నెల 20న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముట్టడి జరగనుందన్నారు. బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్రీడాకారులకు సహకారం

యాచారం: క్రీడల పట్ల ఆసక్తి చూపే ఆటగాళ్లను ఆర్థికంగా ఆదుకుంటానని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనువాస్ అన్నారు. మాల్ గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసుకోవడానికి కాటమయ్య దేవాలయం సమీపంలో యువకులకు శ్రీనివాస్ బుధవారం రూ.15 వేల ఆర్థిక సహాయం చేశారు. గ్రామీణ ప్రాంత యువత క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్నప్పటికీ తగిన ప్రోత్సాహకం లేక ఇబ్బంది పడుతున్నారని, ఇక నుంచి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.

రైతులను గోస పెడుతున్నారు..

- పాల బిల్లులు వెంటనే చెల్లించాలి
- లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తాం
- బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: 'విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించకుండా రైతులను ప్రభుత్వం గోస పెడుతోంది. వెంటనే బిల్లులు చెల్లించాలి. లేని పక్షంలో పాడి రైతులతో కలిసి ట్రాక్టర్లతో అసెంబ్లీని ముట్టడిస్తాం' అని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్‌లు హెచ్చరించారు. పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలో భారీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా చేశారు. రోడ్డుపై పాలు పారబోసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పక్షం రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించేదని, ప్రస్తుత ప్రభుత్వం మూడు నెలలుగా చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్, సరిత, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, బీఆర్ఎస్ నాయకులు రఘు, బాలస్వామి, నిరంజన్‌గౌడ్, పరమేశ్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, శివకుమార్, బద్దు నాయక్, మల్యానాయక్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, ప్రశాంత్, భాస్కర్, గణేశ్, బీమయ్య పాల్గొన్నారు.



రోడ్డుపై పాలు పోసి నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు

'స్వచ్ఛత'ను నిర్లక్ష్యం చేయొద్దు



యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



కడ్తాల్: ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, అధికారులు, నాయకులు

- అక్టోబర్ 2 వరకు కార్యక్రమాలు చేపట్టాలి
- ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2వ తేదీ వరకు గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కాలనీల్లో రోడ్లను, డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయడం, తాగునీటి పైపులు లీకేజీ కాకుండా చూడడం, ట్యాంకులు శుభ్రంగా ఉంచి, పైకప్పులు బిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని వెల్లడించారు. మొక్కలు నాటే కార్యక్రమం, వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. ఈజీఎస్ ఏపీఓ లింగయ్య ఉన్నారు.

నేడు అఖిల పక్ష సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికల(2024)కు సంబంధించి వార్డుల వారీగా ముసాయిదా జాబితా అభ్యంతరాలపై అఖిల పక్ష నాయకులతో గురువారం సమావేశం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు ఉదయం 11 గంటలకు జరిగే సమీక్షకు హాజరు కావాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడ్తాల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీపీ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ సందర్భంగా వారు బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ ట్రాక్టర్లలో తడి పొడి చెత్తను వేరు చేసి వేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పేర్కొన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, నాయకులు నర్సింహ, రాజు, బ్రహ్మచారి, అంగన్‌వాడీ, ఆశ, మహిళా సమాఖ్య సభ్యులు వనిత, లావణ్య, జ్ఞానేశ్వరి, మంగ, శోభ, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల నిరసన

యాచారం: గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు.. గురకుల విద్యా జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం గురుకుల పాఠశాల ఎదుట నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బుధ, గురువారాల్లో నిరసన చేపట్టనున్నారు. గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలల పని వేళలు మార్చాలని, ఉపాధ్యాయులను సొంత జోన్లు, మల్టీజోన్లల్లో నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల డైట్ చార్జీలు పెంచి, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని, వార్డెన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. అన్ని గురుకులాను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు కూకుట్ల యాదయ్య, ఉపాధ్యాయులు నాయక్, నరేందర్, పాండునాయక్, మధు, నాగేశ్వరి, మాధవి, గీతా తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయులకు సన్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బుధవారం నిర్వహించిన స్వాగత, వీడ్కోలు కార్యక్రమంలో మండల పరిధి ఎల్మినేడు గ్రామం హరిజన వాడ పాఠశాలలో పుష్కర కాలంగా పని చేసిన ఉపాధ్యాయురాలు పారిజాత ఇటీవల బదిలీపై కప్పపహాడ్‌కు వెళ్లగా.. బదిలీపై శ్రీనివాసులు వచ్చారు. ఈ సందర్భంగా వీరిని సన్మానించారు.

పేదలకు అన్యాయం జరగనివ్వం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



జిల్లెలగూడ వాసులతో మాట్లాడుతున్న కేఎల్లార్

మీర్‌పేట: పేదలకు గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసి న్యాయం చేస్తుందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ వాసులతో బుధవారం కేఎల్లార్ సమావేశమయ్యారు. జిల్లెలగూడ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఇంటి స్థలాలు కేటాయించగా, భూమి కోర్టు పరిధిలో ఉండడంతో ఇప్పటివరకు పొజిషన్ ఇవ్వలేదని గ్రామస్తులు కేఎల్లార్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అన్యాయం జరగదని, కోర్టు కేసుకు సంబంధించి పూర్వాపరాలు పరిశీలించి, న్యాయ నిపుణులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. దీంతో పాటు కోర్టు కేసులకు అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని ఆయన హామీనిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి ఉన్నారు.